# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పంపిణీ బియ్యాన్ని ఇతర దేశాలకు అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు.
2. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ఏడాది వ్యవధిలో 54 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు.
3. మౌలిక వసతుల కల్పనలో పన్నుల వసూలు ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.
4. తెలంగాణాలో వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు.
5. బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుఫాను తమిళనాడులోని మహాబలిపురం, కారైక్కాల్ మధ్య పుదుచ్చేరి సమీపంలో తీరం దాటింది.

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పంపిణీకి ఉద్దేశించిన బియ్యాన్ని ఇతర దేశాలకు అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అనంతపురం జిల్లా నేమకల్లు గ్రామంలో నిన్న సామాజిక పింఛన్లను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు అందజేసే ప్రజా పంపిణీ బియ్యాన్ని కొందరు వ్యాపారులు అధిక ధరకు కొనుగోలు చేసి విదేశాలకు తరలిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యాపారులను ప్రభుత్వం వదిలి పెట్టబోదని స్పష్టం చేశారు. నేమకల్లు ప్రాజెక్టు సహా రాయలసీమ ప్రాంతంలోని నీటి పారుదల ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇస్తూ..

వాయిస్.. 27 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు బియ్యాన్ని అక్రమంగా తరలించాన్ని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణించడం పట్ల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని భారతీయ జనతా పార్టీ గతంలోనే ప్రశ్నించిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పర్యటన ద్వారా తమ వాదనకు బలం చేకూరిందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ఏడాది వ్యవధిలో 54 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. 21 వేల కోట్ల రూపాయలతో 25 లక్షల మందికి రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో నిన్న జరిగిన రైతుపండుగ ముగింపు వేడుకల్లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మహబూబ్‌నగర్ జిల్లాను అభివృద్ధి చేసేందుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, యువతకు ఉపాధి కల్పించే పారిశ్రామికవాడల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

---------------------------

తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై భారతీయ జనతా పార్టీ ప్రజా ఉద్యమం నిర్వహిస్తుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ ఉద్యమంలో భాగంగా ఈ నెల 6వ తేదీన బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలన పట్ల ఏ ఒక్క వర్గమూరీ సంతృప్తిగా లేదని, రైతులకు అరకొర రుణ మాఫీ చేసి, మొత్తం రుణ మాఫీ చేశామని ఆ పార్టీ చెబుతోందని కిషన్ రెడ్డి ఆరోపించారు.

---------------------------

మాదక ద్రవ్యాల వినియోగాన్ని సంకల్పం కార్యక్రమంతో నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వైద్య విద్యార్థులకు ఆమె సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపరిచి, వాటిపై పోరాటం చేసేందుకు విజయనగరం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "సంకల్పం" కార్యక్రమాన్ని నెలిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోంమంత్రి అనితతో పాటు, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఈగల్' విభాగాన్ని ప్రారంభించిందని తెలిపారు. 1972 రుసుము రహిత నంబరును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

---------------------------

శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. గత కొంతకాలంగా కొందరు రాజకీయ నాయకులు దర్శనానంతరం ఆలయం ముందు పాత్రికేయులతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి ఇటీవల తీర్మానించింది. దీన్ని తాజాగా అమలులోకి తీసుకువచ్చింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టిటిడి నిన్న ఒక ప్రకటనలో పేర్కొంది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుఫాను నిన్న రాత్రి తమిళనాడులో తీరం దాటింది. తమిళనాడులోని మహాబలిపురం, కారైక్కాల్ మధ్య పుదుచ్చేరి సమీపంలో ఫెయింజల్ తుఫాను తీరం దాటిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ రోజు, రేపు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, శ్రీసత్యసాయి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించింది. రేపటి వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. కృష్ణపట్నం పోర్టులో ఆరో నంబరు, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, వాడరేవు పోర్టులకు మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. తుఫాను నేపథ్యంలో విశాఖపట్నం, రేణిగుంట విమానాశ్రయాల నుంచి పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం ఉప్పొంగుతోంది. సముద్రంలో కెరటాలు మూడు నుంచి నాలుగు మీటర్ల ఎత్తుకు ఎగిసిపడుతున్నాయి.

తిరుపతి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్, కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ నిండిపోయాయి. వాగులు, వంకల్లో ప్రవాహాలు మొదలయ్యాయి. పలు మండలాల్లో వరి పొలాలు నీట మునిగాయి. పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా వరి కోతలు నిలిచిపోయాయి. ఏలూరు జిల్లాలో అక్కడక్కడ రహదారులపై ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది.

మరోవైపు.. తెలంగాణాలో కూడా ఈరోజు, రేపు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

ఫెయింజల్ తుపాను నేపథ్యంలో రైతులకు అందుబాటులో ఉండాలని అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నిన్న ఓ ప్రకటన విడుదల చేసింది. వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖ, ఉద్యానశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాయలసీమ జిల్లాల్లో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తుపాను తీవ్రత తగ్గిన వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విద్యుతశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్తు సంస్థల ఉద్యోగులను ఆదేశించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో పాటు ట్రాన్సకో, డిస్కమ్‌ల అధికారులతో మంత్రి నిన్న శ్రవణ మాధ్యమ సమావేశం నిర్వహించారు. గాలుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా వెనువెంటనే చర్యలు చేపట్టాలని విద్యుత్తు సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్తు షాక్‌తో ఏ ఒక్కరి ప్రాణమూ పోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్తు స్తంభాలు, తీగలను అందుబాటులో ఉంచుకోవాలని ట్రాన్స్‌కో, డిస్కమ్‌లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

---------------------------

మౌలిక వసతులు సమకూరాలంటే, పన్నుల వసూలు ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక..

పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థలో అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అభివృద్ధి కోసమే పన్నుల వసూలు చేస్తున్నామని, సకాలంలో పన్నులు చెల్లించకుంటే, చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా పన్నుల చెల్లింపు విధానం ఒకే విధంగా ఉంటుందని మంత్రి నారాయణ వివరిస్తూ...

వాయిస్ (36 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు, బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్..బిక్కీ కోసం ప్రత్యేక పారిశ్రామికవాడను ఏర్పాటు చేస్తామని తెలంగాణా ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం టీహబ్‌లో నిన్న జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ..తమ ప్రభుత్వం అత్యుత్తమ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల విధానం అమలుచేస్తోందని తెలిపారు. సమ్మిళిత అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నామని.. ఉపాధి కులాలవారీగా అందాలనే ఉద్దేశంతో కులగణన చేస్తున్నామని మంత్రి స్పష్టంచేశారు.

======================